సాక్షి
బాపట్ల
బుధవారం । 12 । ఏప్రిల్ । 2023



చెన్నకేశవుడికి సూర్యకిరణ స్పర్శ

జంపని(వేమూరు): జంపని గ్రామంలోగల చెన్న కేశవ స్వామి వారి మూల విరాట్టుని సూర్య కిరణాలు మంగళవారం స్పృశించినట్లు పూజారి శ్రీనివాస మూర్తి తెలిపారు.



నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: మార్కెట్ యార్డులో మంగళవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.4,000, గరిష్ట ధర రూ.8,000, మోడల్ ధర రూ.5,700 వరకు పలికింది.

కరోనా జీరో



గుంటూరు మెడికల్: జిల్లా వ్యాప్తంగా మంగళవారం కరోనా పాజిటివ్ కేసు ఒక్కటి కూడా నమోదు కాలేదు. జిల్లాలో ఎక్కడా కరోనా మరణాలు సంభవించ లేదు.



	ఇఫ్తార్ (బుధ)	సహర్ (గురు)
బాపట్ల	6:27	4:37
నరసరావుపేట	6:29	4:34
గుంటూరు	6:27	4:37

రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

15 నుంచి సముద్రంలో వేట నిషేధం

రేపల్లె రూరల్: సముద్రంలో వేటను ఈనెల 15 నుంచి జూన్ 14 వరకు నిషేధిస్తున్నట్లు మత్స్య శాఖ అభివృద్ధి అధికారి పి.సాయిసందీప్ వెల్లడించారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ తీరప్రాంత మత్స్యకారులు సముద్రంలో ఎవరూ చేపల వేట చేయవద్దని, వేటకు వెళ్లిన వారిపై ఏపీ ఎంఎఫ్ఆర్ యాక్ట్ కింద చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మత్స్యకారులకు వేట నిషేధకాల భృతిని మంజూరు చేసేందుకు ఫిష్ లాండింగ్ సెంటరు వారీగా వేట నిషేధకాల జాబితాను తయారు చేసేందుకు ఈ నెల 17న ఆయా పడవలను తనిఖీ బృందం లాండింగ్ సెంటర్లకు వస్తాయన్నారు. ఆ సమయానికి మత్స్యకారులు తమ పడవలను తనిఖీ నిమిత్తం నిర్దేశించిన ఫిష్ లాండింగ్ సెంటర్లలో అందుబాటులో ఉంచాలన్నారు. వేట నిషేధకాల భృతి పొందేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలలో లబ్ధిదారుడు కాని మత్స్యకారుడు మాత్రమే అర్హుడన్నారు. ఒక హౌస్ హోల్డ్‌ను ఒక కుటుంబంగా పరిగణిస్తామని, ఒక కుటుంబానికి ఒకరు మాత్రమే ఇందుకు అర్హులని చెప్పారు. 18 నుంచి 60 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలనీ, రూ.1.20 లక్షల లోపు ఆదాయం కలిగిన గ్రామీణులు, రూ.1.44 లక్షలలోపు ఆదా యం కలిగిన పట్టణ ప్రజలు అర్హులని చెప్పారు. కుటుంబంలో ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్నా, ఆదాయ పన్ను చెల్లిస్తున్నా వారు ఈ భృతికి అనర్హులని వెల్లడించారు.

సీలింగ్ భూముల క్రమబద్ధీకరణకు అవకాశం

జేసీ రాజకుమారి

గుంటూరు వెస్ట్: పట్టణ భూపరిమితుల చట్టానికి లోబడి ప్రభుత్వ పరిధిలో ఉన్న సీలింగ్, మిగులు భూములను క్రమబద్ధీకరించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం గొప్ప అవకాశం కల్పించిందని జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి తెలిపారు. దీనికి సంబంధించి జీఓ నెంబర్ 84 విడుదల చేశారని చెప్పారు. దీని ప్రకారం మే 1, 2019లోపు రిజిస్టర్ కాబడిన రిజిస్టర్డ్ డాక్యుమెంట్లను పరిగణలోనికి తీసుకుంటామని చెప్పారు. 150 చదరపు గజాల వరకు అన్ని అర్హతలు ఉన్న వారికి ఉచితంగా డి-పట్టా ఇస్తామన్నారు. 150 నుంచి 300 చ.గ. వారికి బేసిక్ విలువలో 15 శాతం చెల్లిస్తే చాలన్నారు. 300 నుంచి 500 చ.గ. వాటికి బేసిక్ విలువలో 30 శాతం చెల్లించాలన్నారు. దరఖాస్తులు ఈ ఏడాది చివరి లోపు చేసుకోవాలన్నారు. దరఖాస్తు సమయంలో 50 శాతం, మిగిలిన 50 శాతం అనుమతి వచ్చిన నెల రోజులలోపు కట్టాలని తెలిపారు.

మే 13న జాతీయ లోక్ అదాలత్

చిలకలూరిపేటటౌన్: జిల్లా న్యాయసేవాధికార సంస్థ, మండల న్యాయసేవాధికార సంఘం ఆధ్వర్యంలో వచ్చేనెల 13 తేదీ జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించనున్నట్లు మండల సేవాధికారసంస్థ చైర్మన్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కె.రవీంద్రరెడ్డి చెప్పారు. ఈ లోక్‌అదాలత్‌లో రాజీపడదగిన క్రిమినల్, సివిల్, భరణం, చెక్‌బౌన్స్ పరిష్కరించుకోవచ్చన్నారు. పట్టణంలోని రెండు న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న రాజీపడదగిన కేసులను పరిష్కరించుకోవాలని సూచించారు.

నేడు డీఎస్సీ1998 నియామకాలు

-గుంటూరు డీఈవో కార్యాలయంలో కౌన్సెలింగ్

గుంటూరు ఎడ్యుకేషన్: డీఎస్సీ-1998 క్వాలిఫైడ్ అభ్యర్థులకు మినిమం టైం స్కేల్ ప్రాతిపదికన ఉపాధ్యాయ నియామకాలు చేపట్టేందుకు బుధవారం గుంటూరులోని జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో 226 మంది అభ్యర్థులతో ఎంపిక జాబితా విడుదల చేశారు. జాబితాను http://doefnt.bofrpot.com సైట్‌లో ఉంచినట్లు డీఈవో పి.శైలజ పేర్కొన్నారు. పేర్లు ఉన్న అభ్యర్థులు బుధవారం ఉదయం 10 గంటలకు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డు, ఐదు పాస్‌పోర్ట్ ఫోటోలు, డీఎస్సీ-1998 హాల్ టిక్కెట్‌ను తీసుకుని గుంటూరు జిల్లా కలెక్టరేట్ వద్ద ఉన్న డీఈవో కార్యాలయంలో నిర్వహించే కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని సూచించారు.

సంక్షేమానికి మరో అడుగు

నవరత్నాల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రజా సంక్షేమ పథకాల్లో మరో బృహత్తర కార్యక్రమానికి ప్రకాశం జిల్లా వేదిక కానుంది. ఈబీసీ నేస్తం రెండో విడత నగదు పంపిణీ కార్యక్రమాన్ని మార్కాపురంలో నేడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించనున్నారు. సీఎం హోదాలో ఇప్పటి వరకు తొమ్మిదిసార్లు జిల్లాకు వచ్చిన వైఎస్ జగన్ నేడు పదోసారి రానున్నారు. సీఎం పర్యటనకు సంబంధించి ఏర్పాట్లు పూర్తయ్యాయి.

- ప్రకాశంలో మరో బృహత్తర పథకానికి శ్రీకారం
- నేడు మార్కాపురంలో ఈబీసీ నేస్తం రెండో విడత కార్యక్రమాన్ని ప్రారంభించనున్న సీఎం వైఎస్ జగన్
- నాడు-నేడు, ఆసరా, మహిళా సంఘాల సున్నావడ్డీ కార్యక్రమాలు జిల్లాలోనే ప్రారంభం
- గతంలో పశ్చిమ ప్రకాశంలో వెలిగొండ ప్రాజెక్టు వద్ద సీఎం సమీక్ష
- సీఎం సభకు భారీ ఏర్పాట్లు
- సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన తరువాత పదోసారి జిల్లాకు..





మార్కాపురంలో ముస్తాబైన సీఎం సభా ప్రాంగణం

సాక్షి ప్రతినిధి, ఒంగోలు:

మరో బృహత్తర పథకాన్ని ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి జిల్లాలో బుధవారం ప్రారంభించనున్నారు. ఈబీసీ నేస్తం రెండో విడత కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు మార్కాపురం రానున్నారు. సంక్షేమ పథకాలను ఒక ఉద్యమంలా చేపడుతూ వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వం ముందుకు సాగుతోంది. అన్ని వర్గాల ప్రజల మన్ననలు పొందుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అడుగులు ముందుకేస్తున్నారు. 2014 ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను ఒకపక్క అమలు పరుస్తూనే మరోపక్క ఇవ్వని హామీలను సైతం నెరవేరుస్తూ సంక్షేమ ప్రభుత్వంగా పాలన సాగిస్తున్నారు. నవరత్నాల ద్వారా తన మ్యానిఫెస్టోను అమలు చేస్తూ ఏదోఒక పథకం ప్రతి గడపకు చేరేలా ప్రణాళికలు రూపొందించారు. అందులో భాగంగానే రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రకాశం జిల్లా కేంద్రంగా ప్రారంభించారు. ఒకటి కాదు రెండు కాదు అనేక సంక్షేమ పథకాలను ఒంగోలు నగరంతో పాటు జిల్లాలోని పలు పట్టణాల నుంచి సీఎం జగన్ ప్రారంభించారు. జిల్లాకు ఒక ప్రత్యేక గుర్తింపును తీసుకొస్తూ రాష్ట్ర స్థాయిలో నిర్వహించే కార్యక్రమాలను ఇక్కడ నుంచే ప్రారంభించటం ఒక మంచి పరిణామంగా జిల్లా ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. సీఎంగా వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మే 31, 2019వ తేదీన ప్రమాణ స్వీకారం చేసిన తరువాత ఇప్పటికే జిల్లాకు తొమ్మిదిసార్లు వచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈబీసీ నేస్తం రెండో విడత నగదు బదిలీ కార్యక్రమాన్ని బుధవారం మార్కాపురం పట్టణాన్ని వేదికగా చేసుకొని ప్రారంభించేందుకు సీఎం వైఎస్ జగన్ పదోసారి రానున్నారు. అందు కోసం మార్కాపురంలోని ఎస్వీకేపీ డిగ్రీ కాలేజీలో పెద్ద ఎత్తున కార్యక్రమానికి ఏర్పాట్లు చేస్తున్నారు. పశ్చిమ ప్రకాశంలో సీఎం హోదాలో బహిరంగ సభ మొదటి సారి నిర్వహిస్తుండటంతో జిల్లా నలుమూలల నుంచి భారీగా జనాలు తరలిరానున్నారు. ఈబీసీలలో ప్రధానంగా రాష్ట్రంలో కమ్మ, రెడ్డి, బ్రాహ్మణ, ఆర్య వైశ్య, క్షత్రియ, వెలమ సామాజిక వర్గాలతోపాటు ఇతర అగ్రవర్ణాల్లోని పేదలు 39,409 మందికి ఒక్కొక్కరికి రూ.15 వేలు చొప్పున మహిళల ఖాతాల్లో రూ.59,11,35,000 జమచేయనున్నారు. జిల్లాలో కమ్మ 12,881, రెడ్డి 20,932, ఆర్యవైశ్య 4032, బ్రాహ్మణ 759, క్షత్రియ 250, వెలమ 93, ఇతర అగ్రవర్ణ పేదలు 462 వెరసి 39,409 కుటుంబాలకు ఈ ప్రయోజనం దక్కనుంది.

మొదటిసారి..

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అధికారం చేపట్టిన ఏడాదే 2019 నవంబర్ 14న ప్రభుత్వ పాఠశాలల ఆధునికీకరణ కార్యక్రమాన్ని ఒంగోలు నగరంలోనే ఆరంభించారు. ఆధునీకీకరణలో భాగంగా చేపట్టిన మొదటి విడత "నాడు-నేడు" కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. 45 వేల ప్రభుత్వ పాఠశాలను మెరుగుపరిచేందుకు రూ.12 వేల కోట్లు ఖర్చు చేస్తూ ఒంగోలు నగరంలోని పీవీఆర్ మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాలలోనే శంకుస్థాపన చేశారు. మొదటి విడతలో 15,715 పాఠశాలలను రూ.3,500 కోట్ల ఖర్చుతో బాగు చేశారు.

రెండోసారి..

ప్రకాశం జిల్లాకు జీవనాడి వంటి పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు పనుల్లో వేగం పెంచేందుకు, ఆ పనులను స్వయంగా పరిశీలించేందుకు 2020 ఫిబ్రవరి 20న దోర్నాల మండలంలోని ప్రాజెక్టు సొరంగ మార్గాల తవ్వకం వద్దకు వచ్చారు. వెలిగొండ ఒకటో టన్నెల్‌ను వేగవంతంగా పూర్తి చేయించారు. ప్రకాశంతోపాటు నెల్లూరు, వైఎస్సార్ కడప జిల్లాలకు కూడా ప్రయోజనం చేకూరేలా 4.473 లక్షల ఎకరాలకు సాగునీరు, 15.25 లక్షల మంది ప్రజలకు తాగునీరు అందించేలా మొత్తం 30 మండలాలకు ఉపయోగపడేలా రూపకల్పన చేశారు. 2021-22 ఆర్థిక సంవత్సరంలో నిర్మాణ పనులు ముందుకు సాగేందుకు రూ.1,595.39 కోట్లు మంజూరు చేశారు. వెలిగొండ ప్రాజెక్టు జలాశయం నల్లమల సాగర్‌ను 53.85 టీఎంసీ సామర్థ్యంతో నీటిని నింపాలన్నదే ప్రధాన ధ్యేయంగా ముందుకు సాగుతున్నారు. 2023-24 బడ్జెట్‌లో ప్రభుత్వం రూ.101.47 కోట్లు కేటాయించింది.

మూడోసారి...

డ్వాక్రా అక్కచెల్లెమ్మలను ఆర్థికంగా ఆదుకునేందుకు ప్రభుత్వం చేపట్టిన 'ఆసరా' కార్యక్రమాన్ని కూడా రెండో విడత ఇక్కడ నుంచే ప్రారంభించారు. 2021న అక్టోబర్ 7వ తేదీ ఒంగోలు నగరంలోని పీవీఆర్ మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాల వేదికగా నిర్వహించారు. ఆసరా రెండో విడతలో 7.97 లక్షల గ్రూపుల్లోని 78.76 లక్షల మంది డ్వాక్రా గ్రూపు మహిళలకు రూ.6,439 కోట్లు పొదుపు ఖాతాల్లో జమ చేశారు.

నాలుగోసారి..

2021 డిసెంబర్ 27వ తేదీ యర్రగొండపాలెం వచ్చారు. అప్పటి విద్యాశాఖ మంత్రి, ప్రస్తుత మున్సిపల్ శాఖ మంత్రి అయిన ఆదిమూలపు సురేష్ కుమారుని వివాహ రిసెప్షన్ కార్యక్రమానికి హాజరయ్యారు.

ఐదోసారి..

మరోసారి ఒంగోలులో సీఎం వైఎస్ జగన్ బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. డ్వాక్రా అక్కచెల్లెమ్మలకు 'వైఎస్సార్ సున్నా వడ్డీ' మూడో విడత పంపిణీ కార్యక్రమాన్ని 2022 ఏప్రిల్ 22న ఇక్కడ నుంచే ప్రారంభించారు. రాష్ట్ర వ్యాప్తంగా 9,76,116 పొదుపు సంఘాలకు సంబంధించిన 1.02 కోట్ల మంది మహిళా సభ్యులకు వైఎస్సార్ సున్నా వడ్డీ ప్రయోజనాన్ని చేకూర్చారు. 2020-21 ఆర్థిక సంవత్సరంలో బ్యాంకుల్లో తీసుకున్న రుణాలకు సంబంధించిన వడ్డీ డబ్బు రూ.1,261.07 కోట్లు ప్రభుత్వం ఆయా సంఘాల బ్యాంకు రుణ ఖాతాల్లో జమచేశారు.

ఆరోసారి..

జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఆమె తనయుడు, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద రెడ్డిల ఆధ్వర్యంలో 2022 ఆగస్టు 24న చీమకుర్తిలో నిర్వహించిన కార్యక్రమానికి వచ్చారు. బూచేపల్లికి చెందిన ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి, దర్శి మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి సుబ్బారెడ్డిల విగ్రహాల ఆవిష్కరణకు చీమకుర్తికి వచ్చారు.

ఏడోసారి..

దర్శి ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ కుమారుని వివాహ రిసెప్షన్‌కు హాజరయ్యేందుకు 2022 డిసెంబర్ 20వ తేదీన దర్శి పట్టణానికి వచ్చారు.

ఎనిమిదో సారి..

రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ తల్లి థెరీసమ్మ మృతి చెందినప్పుడు నివాళులర్పించేందుకు 2022 డిసెంబర్ 27న యర్రగొండపాలెం వచ్చారు.

తొమ్మిదోసారి..

కొండపి వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ వరికూటి అశోక్‌బాబు తల్లి కోటమ్మ మృతి చెందటంతో నివాళులర్పించేందుకు 2023 మార్చి 27వ తేదీన టంగుటూరు మండలం కారుమంచి గ్రామానికి వచ్చారు. కోటమ్మ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.



పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పిస్తున్న జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్



జ్యోతిరావుపూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్

మహిళా సాధికారతకు బాటలు

బాపట్ల: మహిళా సాధికారతకు బాటలు వేసిన గొప్ప మహనీయుడు మహాత్మా జ్యోతిరావ్ పూలే అని కలెక్టర్ కె. విజయకృష్ణన్ కొనియాడారు. పూలే 197వ జయంతి కార్యక్రమాన్ని మంగళవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో జిల్లా బీసీ సంక్షేమశాఖ నిర్వహించింది. అక్కడ ఉన్న పూలే విగ్రహానికి కలెక్టర్ పుష్పమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. బాలికల విద్యను జ్యోతి రావ్ పూలే ఎంతో ప్రోత్సహించారని, ఆయనను స్ఫూర్తిగా తీసుకుని మాలాంటి మహిళలు ఎంతో మంది బాగా చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకున్నారని తెలిపారు. ఆయన కృషిని గుర్తించి జిల్లాలోని బాలికలందరినీ బాగా చదివించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికార్లు పాల్గొన్నారు.

నేడు సీఎం పర్యటన ఇలా..



వేదిక ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి సురేష్, ఎమ్మెల్యే కేపీ, కలెక్టర్, ఎస్పీ, జేసీ

మార్కాపురం: ఈబీసీ నేస్తం రెండో విడత నగదు పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం మార్కాపురం రానున్నట్లు ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి తెలిపారు. స్థానిక ఎస్వీకేపీ కళాశాలలో సీఎం సభ ఏర్పాట్లను మంగళవారం మంత్రి ఆదిమూలపు సురేష్, కలెక్టర్ దినేష్ కుమార్, ఎస్పీ మలికాగర్గ్‌లతో కలిసి పరిశీలించిన ఎమ్మెల్యే అనంతరం మీడియాకు సీఎం పర్యటన వివరాలు వెల్లడించారు. ఉదయం 9 గంటలకు సీఎం ఇంటి నుంచి బయల్దేరి గం.9.05 కు తాడేపల్లిలోని హెలీప్యాడ్ చేరుకుంటారు. అక్కడ నుంచి బయలుదేరి గం.9.55కు మార్కాపురం పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలోని హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు. గం.10.05కు ప్రజాప్రతినిధులతో మాట్లాడారు. అనంతరం అక్కడి నుంచి బయలుదేరి గం.10.15కు డిగ్రీ కళాశాలకు చేరుకుంటారు. మార్కాపురం పట్టణానికి సాగర్ నీళ్లు అందించే జోన్-2 నీటి పథకానికి పొదిలి పెద్ద చెరువు పైప్ లైన్ పనులకు భూమి పూజ చేస్తారు. గం.10.25 నుంచి గం.10.35 వరకు ఫొటో గ్యాలరీ సందర్శించి ఈబీసీ లబ్ధిదారులతో మాట్లాడతారు. గం.10.35 కు వేదిక మీద జ్యోతి ప్రజ్వలన చేస్తారు. 11 గంటలకు ఈబీసీ నేస్తం పథకాన్ని ప్రారంభించిన అనంతరం గం.11.15 వరకు లబ్ధిదారులతో ఇంట్రాక్షన్ ఉంటుంది. అక్కడి నుంచి 12 గంటల వరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగిస్తారు. 12 గంటలకు ఈబీసీ నేస్తం నిధులను డీబీటీ విధానంలో విడుదల చేస్తారు. గం.12.15కు రోడ్డు మార్గాన హెలీప్యాడ్ చేరుకుంటారు. గం.12.15 నుంచి గం.12.35 వరకు స్థానిక నేతలతో మాట్లాడతారు. అనంతరం గం.12.40కి హెలీప్యాడ్ వద్దకు వెళ్లి తాడేపల్లి బయలుదేరుతారు.

ఏర్పాట్లు పూర్తి:

సభావేదికతో పాటు హెలీప్యాడ్ నిర్మాణం కూడా పూర్తయింది. ఏర్పాట్లను ఎమ్మెల్యే కేపీ నాగార్జున రెడ్డి, ఆయన సోదరుడు కృష్ణమోహన్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి షంషేర్ అలీబేగ్, మున్సిపల్ చైర్మన్ బాలమురళీకృష్ణ, వైస్ చైర్మన్‌లు షేక్ ఇస్మాయిల్, అంజమ్మ శ్రీనివాసులు, మార్కెట్ యార్డ్ చైర్మన్ గొలమారి శ్రీనివాసరెడ్డి, జెడ్పీటీసీ బాపన్ రెడ్డి, ఎంపీపీ అరుణ చెంచిరెడ్డిలతో కలసి పరిశీలించారు. కౌన్సిలర్లకు ఏర్పాట్ల బాధ్యతలు అప్పగించారు. సుమారు 40 వేల మంది సభా ప్రాంగణంలో కూర్చునేలా ఏర్పాట్లు చేశారు. వచ్చిన వారందరికీ చల్లటి మజ్జిగ, మంచి నీళ్లు, స్నాక్స్ అందించనున్నారు. ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఎండ వేడి తట్టుకునేందుకు కూలర్స్, ఫ్యాన్లు ఏర్పాటు చేశారు.

అప్పులు చేసి జేబులు నింపుకున్న టీడీపీ

- వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్ బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు టౌన్: అభివృద్ధి పేరుతో లక్షల కోట్లు అప్పులు చేసిన తెలుగుదేశం పార్టీ జన్మభూమి, నీరు చెట్టు పేరుతో జేబులు నింపుకుందని వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి విమర్శించారు. వైఎస్సార్ కాంగ్రెస్ సాంస్కృతిక విభాగం ఆధ్వర్యంలో ఒంగోలు లోని ఎన్టీఆర్ కళాక్షేత్రంలో మంగళవారం నిర్వహించిన జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సభకు సాంస్కృతిక విభాగం జోనల్ ఇన్‌చార్జి బొట్ల సుబ్బారావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా బాలినేని మాట్లాడుతూ టీడీపీ హయాంలో పేదల పొట్టలు కొట్టడం తప్ప వారి సంక్షేమానికి చేసిందేమీ లేదని విమర్శించారు. చంద్రబాబు పాలనలో తీసుకొని వచ్చిన అప్పులను ఏం చేశారో చెప్పాలని ప్రశ్నించారు. ఒంగోలును తామే అభివృద్ధి చేశామని చెప్పుకుంటున్న ఆ పార్టీ నాయకుడు నిర్దిష్టంగా ఫలానా అభివృద్ధి చేశామని చెప్పగలరా అని నిలదీశారు. ఒంగోలుకు రిమ్స్ హాస్పిటల్, చెక్‌డ్యాంలు తెచ్చామని, తాజాగా మంచినీటి సమస్య శాశ్వత పరిష్కారానికి రూ.300 కోట్లు తీసుకొచ్చామని వివరించారు. మల్లవరం ప్రాజెక్టు నుంచి ఒంగోలుకు నీళ్లు తెచ్చేందుకు రూ.121 కోట్లు తెచ్చినట్లు చెప్పుకుంటున్న టీడీపీ నాయకులు అందులో రూ.70 కోట్లు కార్పొరేషన్ మీద భరించలేని భారం వేశారన్నారు. మంచినీటి సమస్య పరిష్కరించేందుకు తాము తీసుకొని వచ్చిన రూ.300 కోట్లు మొత్తం రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందన్నారు. ఒంగోలు నగరంలో మొత్తం మంచినీటి పైపులను మార్చేసి కొత్త పైపులు వేస్తామని, నీళ్ల కోసం అర్ధరాత్రిళ్ల వరకు వేచి ఉండకుండా పట్టపగలే నీటి సరఫరా చేస్తామని తెలిపారు. 25 వేల మంది పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వకుండా అడ్డుకున్న టీడీపీ నాయకుల కుట్రలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఎవరు ఎన్ని అడ్డంకులు సృష్టించినా పేదలకు స్థలాలు ఇచ్చి తీరుతామని తేల్చి చెప్పారు.

పూలే భవనం నిర్మిస్తాం...

మహాత్మా జ్యోతిరావు పూలే జయంతిని పురస్కరించుకుని నివాళి అర్పించిన ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ప్రజల మధ్య సమానత్వం కోసం జ్యోతిరావు పూలే అహర్నిశలు పాటుపడ్డారని చెప్పారు. ఒంగోలు నగరంలో జ్యోతిరావు పూలే భవన నిర్మాణాన్ని చేపడతామని ప్రకటించారు. భవనం కోసం స్థలాన్ని చూడాలని కలెక్టర్‌కు చెప్పినట్లు తెలిపారు.

పేదల ఖాతాల్లో రూ.2 లక్షల కోట్లు..

పేద ప్రజలకు నవరత్నాలు ఇచ్చిన వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం రూ.2 లక్షల కోట్లను ప్రజల ఖాతాల్లో వేసిందని బాలినేని చెప్పారు. కోవిడ్ వల్ల రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేకపోయినప్పటికీ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామన్నారు. దేశంలో అప్పులు చేయని రాష్ట్రం ఏదైనా ఉందా అని ప్రశ్నించారు. బీజేపీ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు కూడా అప్పులు చేస్తున్నారని, కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నా వారు ఎందుకు అప్పులు చేస్తున్నారో చెప్పాలన్నారు. కార్యక్రమంలో నగర మేయర్ గంగాడ సుజాత, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జి బొట్ల రామారావు, కఠారి శంకర్, వివిధ కార్పొరేషన్ చైర్మన్‌లు షేక్ సుభానీ, మనోజ్ కుమార్, పార్టీ నాయకులు దామరాజు క్రాంతి కుమార్, తమ్మినేని మాధవి, బేతంశెట్టి హరిబాబు, పి.శ్రీను, చల్లా తిరుమల యాదవ్, రంగారావు, నాగం శేషగిరి రావు, తిర్లిక వాసు, దాసరి కరుణ, షేక్ మహబూబ్ పాల్గొన్నారు.

ట్యాబ్‌పై బోధనకు శిక్షణ

- జిల్లా విద్యాశిక్షణ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహణ
- 75 శాతం ఉపాధ్యాయులు హాజరు
- ఆన్‌లైన్ శిక్షణకు హాజరుకాని వారికి మరో అవకాశం



ఉమ్మడి జిల్లాలోని ఉపాధ్యాయులకు ఆన్‌లైన్ ద్వారా శిక్షణ ఇస్తున్న దృశ్యం

యడ్లపాడు: ప్రభుత్వ పాఠశాలల్లో ఎనిమిదో తరగతి అభ్యసించే విద్యార్థులకు బైజూస్ ట్యాబ్‌ల ద్వారా సమగ్ర బోధన చేయాలని డైట్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ఎం సుభాని తెలిపారు. మంగళవారం బైజూస్ ట్యాబ్‌ల వినియోగం, బోధన ప్రక్రియ, నిర్వహణ అంశాలపై ఆన్‌లైన్ శిక్షణ ఇచ్చారు. బోయపాలెం జిల్లా విద్యాశిక్షణ సంస్థ ఆధ్వర్యంలో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లోని 5 వేల మంది ఉపాధ్యాయులకు ఐదు విభాగాలుగా ఈ శిక్షణ అందించారు. శిక్షణలో ట్యాబ్ ఆవశ్యకత, వాటి నిర్వహణను డైట్ కళాశాల అధ్యాపకులు సౌజన్య, డాక్టర్ ప్రసాద్‌లు అవగాహన కల్పించారు. ప్రోగ్రాం స్టేట్ నోడల్ ఆఫీసర్ హెచ్.పి.ఎస్. రమేష్ కుమార్ లాంగ్వేజెస్‌కు సంబంధించిన కంటెంట్‌పై త్వరలో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. టెక్బో కంపెనీ ప్రతినిధులు సుమన్, సాయికృష్ణ ట్యాబ్ పాలసీ, కొత్త ప్యాచ్ ఇన్‌స్టాల్ చేయడం, వాటి సెక్యూరిటీ గురించి వివరించారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా నోడల్ పర్సన్ ఎం.పూర్ణచందరరావు, జి. ప్రకాష్, పాల్గొన్నారు.

ఆర్పీల అపహారుణం

- మెప్మాలో మాయాజాలం
- డ్వాక్రా సంఘాల పేరుతో రుణాల కాజేత
- సుమారు రూ.కోటిన్నర మేర టోకరా
- మరిన్ని అక్రమాలు వెలుగులోకి వచ్చే చాన్స్



రేపల్లె: మహిళలకు ఆర్థిక సామాజిక భద్రత కల్పించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) అక్రమాలకు అడ్డాగా మారింది. బాపట్ల జిల్లా, రేపల్లె పురపాలక సంఘం మెప్మా విభాగంలో పనిచేస్తున్న యానిమేటర్లు స్వయం సహాయక సంఘాలను అడ్డుపెట్టుకుని కొందరు బ్యాంకులను లూటీ చేశారు. సేకరించిన వివరాల ప్రకారం మెప్మాలో ఆర్పీ(రిసోర్స్ పర్సన్లు)లుగా పనిచేస్తున్న రేపల్లె 21వ వార్డుకు చెందిన ఇద్దరు మహిళలు, మరో మహిళ కలిసి 2019 ఏప్రిల్ 11కు ముందు ఉన్న గ్రూపులను లక్ష్యంగా చేసుకుని మోసానికి తెగబడ్డారు. కొందరు నిరక్షరాస్యులతో మాట్లాడి వారికి ప్రత్యేక పొదుపు సంఘాలు ఉన్నా, మీకు ఒక్కొక్కరికి రూ.5,000 అప్పు ఇప్పిస్తామని, రుణమాఫీ వస్తుందని, తిరిగి కట్టవలసిన అవసరం లేదని చెప్పి వారి గ్రూప్ పేరుతోనే రూ.10 లక్షల మేర రుణాలు పొందారు. ముందు అనుకున్న ప్రకారం సంఘ సభ్యుల చేతుల్లో రూ.5 వేలు పెట్టారు. ఈ తతంగం మెప్మాలో పనిచేస్తున్న సిబ్బందితోపాటు బ్యాంక్ అధికారుల సహకారంతోనే జరిగిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇలా గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకులో 11 గ్రూప్‌లకు కలిపి సుమారు కోటి 15 లక్షల రూపాయల లింకేజీ రుణాలు తీసుకున్నట్టు సమాచారం. ఇలాగే మరికొన్ని బ్యాంకుల్లోనూ అప్పులు తీసుకున్నట్టు తెలుస్తోంది. కెనరా బ్యాంకులో రూ.35 లక్షల మేర రుణాలు తీసుకున్నట్టు సమాచారం. తిలాపాపం తలా పిడికెడు అన్న రీతిగా నిరక్షరాస్యులైన డ్వాక్రా మహిళలను ఏమార్చి ఒక్కొక్క గ్రూపునకు రూ.10 లక్షలు, కొన్ని గ్రూప్‌లకు రూ.20 లక్షలు, మరికొన్ని గ్రూపులకు రూ.6 లక్షల మేర రుణాలు మంజూరు చేయించి కాజేశారు. తీసుకున్న రుణాలు ఎంతకీ చెల్లించక పోవటం, ఎన్నిసార్లు ఆర్పీలకు ఫోన్ చేసినా స్పందన లేకపోవడంతో బ్యాంకు అధికారులు డ్వాక్రా మహిళలకు నోటీసులు పంపటంతో అక్రమాలు వెలుగు చూశాయి. ఒకే మహిళా సంఘం పేరున జీడీసీసీ బ్యాంకులోనూ, కెనరా బ్యాంకులోనూ రుణం ఉండడం గమనార్హం. ఈ రెండు బ్యాంకుల్లోనూ మహిళల ఫోటోలు, పేర్లు, చిరునామాలకు పొంతన లేకుండా ఉంది. నిజాంపట్నం, తాడేపల్లి, భీమవరం, అనకాపల్లి మరికొన్ని రూరల్ ప్రాంతాల చిరునామాలు, రేపల్లె పురపాలక సంఘంలో ఉన్న స్వయం సహాయక గ్రూపుల్లో ఉండటం విస్తుగొలుపుతోంది.

ఇవిగో నిదర్శనాలు

జీడీసీసీ బ్యాంకు రేపల్లె శాఖలో రోషిణి, అప్సరా, అప్సని, షాహీనా, బిస్మిల్లా, రామకృష్ణ, శ్రీ నాగేశ్వరి, తేజ, జరీనా, ఫైజుల్లా, మహిళ పొదుపు సంఘాల పేర్లతో రుణాలు ఉన్నాయి. కెనరా బ్యాంకులో తేజ స్వయం సహాయక సంఘానికి మూడు విడతల్లో ఆసరా పథకం ద్వారా రూ.39,766 రుణమాఫీ డబ్బులు పడ్డాయి. అప్సరా గ్రూప్‌నకు రూ.1,12,191, బిస్మిల్లా గ్రూపునకు రూ.1,20,500, రామకృష్ణ గ్రూపుకు రూ.1,67,943 రోషిణి గ్రూపునకు రూ.1,48,756 ఆసరా పథకం ద్వారా జమయ్యాయి. వాస్తవానికి ఒక బ్యాంకులో రుణం ఉంటే రెండో బ్యాంకులో మంజూరు కాదు. కానీ ఇక్కడ ఇది ఎలా సాధ్యమైంది అన్నది అర్థం కావట్లేదు. దీనిపై తమకు ఏమీ తెలియదని జీడీసీసీ బ్యాంకు సిబ్బంది చెబుతున్నారు. మెప్మా సిబ్బంది అంగీకారం తెలిపారు కాబట్టి రుణాలు మంజూరు చేశామని చెబుతున్నారు. పూర్తిస్థాయి విచారణ చేపడితే మరిన్ని అక్రమాలు బయటపడే ఆస్కారం ఉంది.

అక్రమాలు జరిగిన మాట వాస్తవమే

ఆర్పీలు అక్రమాలకు పాల్పడిన మాట వాస్తవమే. ఇప్పటికే ఇద్దరు ఆర్పీలను విధులకు దూరంగా ఉంచాం.

– సుగుణ, మెప్మా సీఎంఎం (సిటీ మిషన్ మేనేజర్), రేపల్లె

తప్పుడు పత్రాలతో రుణాలు పొందారు

తప్పుడు పత్రాలతో ఆర్పీలు రుణాలు పొందిన మాట వాస్తవమే. రికవరీ చేయకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. మెప్మా సిబ్బంది రుణాలు పొందే వారి దరఖాస్తులు ఆన్‌లైన్ చేయక పోవటం వల్ల తప్పు జరిగింది.

– వెంకటరమణ, జీడీసీసీ బ్యాంకు మేనేజర్, రేపల్లె

సంస్కృతి, సంప్రదాయాలు పాటించాలి

కలెక్టర్ విజయకృష్ణన్



కొండపాటూరు అమ్మవారి ప్రభను టెంకాయకొట్టి ప్రారంభిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్

బాపట్ల: సంస్కృతి, సంప్రదాయాలను పాటించటం సమాజాభివృద్ధికి దోహదపడుతుందని కలెక్టర్ విజయకృష్ణన్ పేర్కొన్నారు. బాపట్లలోని చీలు రోడ్డు సెంటర్ నుంచి కొండపాటూరు పోలేరమ్మ తిరునాళ్లకు బయలుదేరిన ప్రభను మంగళవారం టెంకాయ కొట్టి కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం భక్తులు భారీగా తిరునాళ్లకు తరలివెళ్లారు.

మోహన్‌బాబు కుటుంబ సభ్యులకు హైకోర్టు జడ్జి పరామర్శ



శారదాదేవిని పరామర్శిస్తున్న హైకోర్టు జడ్జి రామకృష్ణప్రసాద్

కారంచేడు: సినీ నిర్మాత, మాజీ ఎంపీ డాక్టర్ దగ్గుబాటి రామానాయుడు తమ్ముడు, సినీ నిర్మాత దగ్గుబాటి రామ్మోహనరావు (మోహన్‌బాబు) ఈనెల 4న మృతి చెందిన విషయం తెలిసిందే. మోహన్‌బాబు కుటుంబానికి సన్నిహితులు, బంధువు అయిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణ ప్రసాద్ మంగళవారం సాయంత్రం కారంచేడు వచ్చారు. మోహన్‌బాబు సతీమణి శారదాదేవిని, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు.

పూజారికి ఐదేళ్లు జైలు

గుంటూరు లీగల్: గుడికి వచ్చిన బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన పూజారికి ఐదేళ్లు జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ పోక్సో కోర్టు న్యాయమూర్తి సోమవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తెలిపిన వివరాల మేరకు.. మంగళగిరి రూరల్ పీస్ పరిధిలోని ఓ గుడిలో కృష్ణమూర్తి అనే వ్యక్తి పూజారిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నాడు. 2019లో పూజ చేయించుకునేందుకు బాలిక గుడికి రాగా హారతి ఇచ్చే సమయంలో ఆమెతో అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో బాలిక ఇంటికి వెళ్లి జరిగిన విషయాన్ని తన తల్లికి చెప్పింది. తల్లి స్థానిక పెద్దలను తీసుకెళ్లి పూజారిని నిలదీసింది. అనంతరం మంగళగిరి రూరల్ పోలీస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కృష్ణమూర్తిపై నేరం రుజువు కావడంతో పోక్సో కోర్టు న్యాయమూర్తి కె.సీతారామకృష్ణారావు పైవిధంగా తీర్పు చెప్పారు.

రాజ్యాంగ స్ఫూర్తి వెల్లివిరియాలి

మానవ హక్కుల ఉద్యమ నేత హరగోపాల్



పాకెట్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

బాపట్ల: రాజ్యాంగ స్ఫూర్తి వెల్లివిరియాలని మానవ హక్కుల ఉద్యమ నేత ఆచార్య జి.హరగోపాల్ ఆకాంక్షించారు. రాజ్యాంగ విలువలను ప్రతి ఒక్కరూ పాటించాలని కోరారు. రాజ్యాంగ పీఠిక వ్యక్తి స్వాతంత్ర్యానికి, గౌరవానికి, జాతి సమైక్యతకు పెద్ద పీట వేసిందని చెప్పారు. ఫోరం ఫర్ బెటర్ బాపట్ల వారు ముద్రించిన రాజ్యాంగ పీఠిక పాకెట్ క్యాలెండర్లను హరగోపాల్ మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఫోరం కార్యదర్శి డాక్టర్ పీసీ సాయిబాబు మాట్లాడుతూ రాజ్యాంగ స్ఫూర్తిని దశ దిశల వ్యాపింప చేయాలనే లక్ష్యంతో ఈ క్యాలెండర్లను పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. మన రాజ్యాంగం గురించి అందరికీ కనీస అవగాహన ఉండాలని అన్నారు. కార్యక్రమంలో ఏపీ మానవ వనరుల అభివృద్ధి సంస్థ వ్యవస్థాపక డైరెక్టర్ జనరల్ డి.చక్రపాణి, ఆచార్య కె.విజయ కుమార్ పాల్గొన్నారు.

కామన్‌వెల్త్ ప్రిలిమినరీ పోటీలకు ప్రేమ్‌సాగర్

అందిన 'సాయ్' ఆహ్వానం
క్రీడాకారుల హర్షం



దేవరకొండ ప్రేమసాగర్

చీరాల రూరల్: కామన్‌వెల్త్ యూత్, జూనియర్, సీనియర్ వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్–2023 పోటీలు జూలై 11 నుంచి 16 వరకు ఢిల్లీలో జరగనున్నాయి. పోటీల్లో పాల్గొనేందుకు చీరాల మండలం బుర్లవారిపాలెం పంచాయతీ సాయికాలనీకి చెందిన దేవరకొండ ప్రేమ్‌సాగర్‌కు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా నుంచి ఆహ్వానం అందినట్లు ఉమ్మడి జిల్లాల వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ సెక్రటరీ డాక్టర్ పున్నారావు, విశ్రాంత డీఎస్‌డీవో శ్రీనివాస ప్రసాద్ తెలిపారు. మే 10వ తేదీలోగా ప్రేమ్‌సాగర్ పాటియాల చేరుకోవాలని వారు పేర్కొన్నారు. ఇప్పటికే ప్రేమ్‌సాగర్ అనేక పోటీల్లో పాల్గొని మంచి ప్రతిభ చూపి పతకాలు సాధించాడు. ప్రస్తుతం 73 కేజీల విభాగంలో బాపట్ల జిల్లా నుంచి ఏపీ తరఫున ప్రేమసాగర్ ఒక్కడే ఎంపిక కావడంపై క్రీడాకారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పోటీల్లో ప్రతిభ చూపి పతకాలు సాధించి దేశానికి మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని క్రీడా ప్రేమికులు కోరుతున్నారు.

సకాలంలో రుణాలు చెల్లించాలి

డీఆర్‌డీఏ పీడీ అర్జున్‌రావు



మాట్లాడుతున్న పీడీ అర్జునరావు

బల్లికురవ: ప్రభుత్వం పొదుపు సంఘాల బలోపేతానికి మహిళల జీవనోపాధి అవకాశాల పెంపుదలకు అందిస్తున్న స్త్రీనిధి, ఉన్నతి, బ్యాంకు లింకేజి రుణాలు సకాలంలో చెల్లించాలని డీఆర్‌డీఏ పీడీ డాక్టర్ బి.అర్జున్‌రావు కోరారు. మంగళవారం బల్లికురవలోని వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో మండలంలోని 42 గ్రామైక్య సంఘాలతో సమీక్ష నిర్వహించారు. 2022–23 సంవత్సరానికి స్త్రీనిధి, సీఏఎఫ్ ఉన్నతి, బ్యాంక్ లింకేజ్ రుణాలు రూ.52 కోట్ల వరకు అందజేసినట్లు చెప్పారు. సూరేపల్లి, పెదఅంబడిపూడి, కొప్పరపాడు, గ్రామైక్య సంఘాలు దాదాపు రూ.22 లక్షలు రుణాలు చెల్లించకపోవటంపై పీడీ అసహనం వ్యక్తం చేశారు. 2023–24 సంవత్సరానికి రుణ లక్ష్యాలను పెంచనున్నట్లు ప్రకటించారు. సమీక్షలో ఏపీఎం బీ. సురేంద్రబాబు, స్త్రీనిధి మేనేజర్ శంకర్ పాల్గొన్నారు.

బొబ్బేపల్లిలో మైనింగ్ అధికారుల తనిఖీ



గ్రావెల్ తవ్వకాలు జరుపుతున్న ప్రాంతం

మార్టూరు: బొబ్బేపల్లి గ్రామంలో మైనింగ్ విజిలెన్స్ అధికారులు మంగళవారం తనిఖీలు నిర్వహించారు. రీజినల్ విజిలెన్స్ స్క్వాడ్ అధికారి జగన్నాథరావు, అసిస్టెంట్ జియాలజిస్ట్ రమేష్ కుమార్‌రెడ్డి పరిశీలించి మాట్లాడారు. బొబ్బేపల్లి కొండ సమీపంలో సర్వే నంబర్ 387లో గ్రావెల్ తవ్వకాల కోసం అదే గ్రామానికి చెందిన కుంచపు వీరాంజనేయులు గతంలో అనుమతులు తీసుకుని ఉన్నాడు. అదే గ్రామానికి చెందిన కొందరు అనుమతులు లేకుండా గ్రావెల్ తవ్వకాలకు పాల్పడుతున్నారంటూ వీరాంజనేయులు గత సోమవారం బాపట్ల గ్రీవెన్స్‌సెల్‌లో అధికారులకు ఫిర్యాదు చేశాడు. ఈక్రమంలో అధికారులు మంగళవారం సాయంత్రం గ్రామంలో మైనింగ్ జరుగుతున్న ప్రాంతాన్ని పరిశీలించారు. అసిస్టెంట్ జియాలజిస్ట్ రమేష్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ గ్రావెల్ తవ్వకాలు ఇతరులు జరుపుతున్న మాట వాస్తవమేనని, కానీ కుంచపు వీరాంజనేయులుకు అనుమతులిచ్చిన ప్రాంతంలో తవ్వకాలు జరగడం లేదని పేర్కొన్నారు. సర్వే నంబర్ 387లో వెలుపల వైపు గ్రామస్తులు తవ్వకాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గ్రామంలో రోడ్లు తదితర అవసరాల కోసం 1,100 ట్రక్కుల గ్రావెల్ అవసరమైనందున పంచాయతీ తీర్మానం చేసుకొని తవ్వకాలు జరిపినట్టు పంచాయతీ సర్పంచ్ వర్గం చెబుతోందని వివరించారు.

మైనింగ్, రెవెన్యూ అనుమతులు తప్పనిసరి

రీజినల్ విజిలెన్స్ స్క్వాడ్ అధికారి జగన్నాథరావు మాట్లాడుతూ కేవలం పంచాయతీ తీర్మానం చేసుకొని గ్రావెల్ తవ్వకాలు జరుపుకుంటామంటే కుదరదని, మైనింగ్, రెవెన్యూ శాఖల అనుమతులు తీసుకుంటేనే తవ్వకాలు జరుపుకోవాలని చెప్పారు. గ్రావెల్ తవ్వకాలు జరుపుతున్న ప్రాంతాన్ని పూర్తిగా సర్వే చేసి శాఖాపరమైన చర్యలు తీసుకోనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో అధికారులు భాస్కర్‌రెడ్డి, రాజీనాయుడు, స్థానిక రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పరీక్ష ఫెయిల్ అవుతానన్న భయంతో బాలిక బలవన్మరణం



ఆత్మహత్యకు పాల్పడిన నాగపూజిత

మార్టూరు: పదో తరగతి చదువుతున్న ఓ విద్యార్థిని తాను ముందురోజు రాసిన పరీక్ష ఫెయిల్ అవుతానన్న భయంతో బలవన్మరణానికి పాల్పడింది. ఈ దుర్ఘటన బాపట్ల జిల్లా మార్టూరు మండలంలోని డేగరమూడి గ్రామంలో మంగళవారం జరిగింది. సీఐ ఎస్‌కేటీ ఫిరోజ్, ఉపాధ్యాయులు, స్థానికుల కథనం ప్రకారం.. స్థానిక ఆదర్శ నగర్ కాలనీకి చెందిన ముక్తిపాటి అంకమ్మరావు, పుణ్యవతి దంపతుల కుమార్తె నాగపూజిత (15) ప్రస్తుతం మార్టూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షలు రాస్తోంది. మంగళవారం ఉదయం తల్లిదండ్రులు పనుల మీద బయటకు వెళ్లగా నాగపూజిత ఇంటిలోని సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకొని బలవన్మరణానికి పాల్పడింది. సుమారు 11 గంటల సమయంలో నాగపూజిత అమ్మమ్మ, తాతయ్యలు ఇంటిలో ఫ్యాన్‌కు వేలాడుతున్న మనుమరాలిని గమనించి, స్థానికుల సహాయంతో కిందకు దించి 108 ద్వారా మార్టూరు ప్రభుత్వాస్పత్రి కి తరలించారు. బాలికను పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. సీఐ ఫిరోజ్ ఆస్పత్రికి వెళ్లి బాధిత కుటుంబాన్ని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇప్పటికి నాలుగు పరీక్షలు రాసి మరో రెండు పరీక్షలకు సిద్ధమవుతున్న నాగపూజిత తెలివైన, చురుకైన విద్యార్థిని అని, అయితే ముందు రోజు రాసిన లెక్కల పరీక్షలో మార్కులు తగ్గుతాయనే అనుమానంతో ఆందోళనకు గురై ఈ దారుణానికి ఒడిగట్టినట్టు తండ్రి అంకమ్మరావు పోలీసుల వద్ద కన్నీరుమున్నీరయ్యాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించనున్నట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం మత్తులో ఘర్షణ.. వ్యక్తి హత్య



రవి మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్‌హెచ్‌ఓ రామానాయక్

గుంటూరు ఈస్ట్: మద్యం మత్తులో స్నేహితుడిని హత్య చేసిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. అరండల్‌పేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శారదాకాలనీకి జి.రవి(35), అదే ప్రాంతానికి చెందిన బాజీ స్నేహితులు. ఇరువురు బేల్దారి పనులు చేసుకుంటూ జీవిస్తుంటారు. మంగళవారం ఉదయం ఇరువురూ మద్యం సేవించి అమరావతి రోడ్డులో వెళుతూ గొడవ పడ్డారు. ఘర్షణ పడుతున్న సమయంలో స్థానికులు వారిని సర్ది చెప్పి పంపించారు. బాజీ మళ్లీ మద్యం సేవించి రవి వద్దకు వచ్చి గొడవ పడి, పక్కనే ఉన్న బండరాయితో రవి తలపై మోదాడు. తీవ్రగాయమై, రక్తస్రావం జరిగి ఘటనా స్థలంలోనే రవి మృతిచెందాడు. ఎస్‌హెచ్‌ఓ రామానాయక్ ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించి మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

డీఎల్‌ఎస్‌ఏలో ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

గుంటూరు లీగల్: జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ(డీఎల్‌ఎస్‌ఏ)లో అవుట్ సోర్సింగ్ విధానంలో పని చేసేందుకు పలు ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి వై.వి.ఎస్.బి.జి. పార్థసారథి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. టైపిస్ట్ కమ్ అసిస్టెంట్, ఖాళీలు–1, జీతం రూ.18,500, కార్యాలయ సబార్డినేట్లు, ఖాళీలు –2, జీతం రూ. 15,000. ఆసక్తిగలవారు తమ దరఖాస్తులను చైర్మన్, జిల్లా న్యాయ సేవల అథారిటీ, గుంటూరు చిరునామాకు పంపాలని సూచించారు. ఏప్రిల్ 21 దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీ అని పేర్కొన్నారు. మిగిలిన వివరాలను జిల్లా కోర్టు వెబ్‌సైట్‌లో చూడాలని తెలియజేశారు.

ఇద్దరు ఎస్‌ఐల బదిలీ

బాపట్లటౌన్: జిల్లాలో ఇద్దరు ఎస్‌ఐలను బదిలీ చేస్తూ ఎస్పీ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. సంతమాగులూరు ఎస్‌ఐగా పనిచేస్తున్న పి.నాగశివారెడ్డిని వీఆర్‌కు, మేదరమెట్ల ఎస్‌ఐగా పనిచేస్తున్న ఎం.వి.శివకుమార్‌ను సంతమాగులూరు స్టేషన్‌కు బదిలీచేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఏపీ గురుకుల ఉర్దూ బాలుర పాఠశాలలో ప్రవేశాలు

గుంటూరు ఎడ్యుకేషన్: పాత గుంటూరు నందివెలుగురోడ్డులోని ఆంధ్రప్రదేశ్ గురుకుల ఉర్దూ బాలుర పాఠశాలలో 5వ తరగతిలో ప్రవేశాలు కల్పిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ టీపీవీఎస్సార్ లక్ష్మి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2023–24 విద్యాసంవత్సరానికి 5వ తరగతిలో ప్రవేశంతో పాటు 6,7,8 తరగతుల్లో మిగిలిన సీట్లను భర్తీ చేసేందుకు ముస్లిం మైనార్టీ విద్యార్థులు https:aprs.apcfss.inవెబ్‌సైట్‌లో దరఖాస్తు, ప్రాస్పెక్టస్‌ను డౌన్‌లోడ్ చేసుకుని, తిరిగి అదేసైట్‌లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేయాలని సూచించారు. అదేవిధంగా మైనార్టీ విద్యార్థులకు ప్రవేశ పరీక్ష లేకుండా మే 15 నుంచి జూన్ 30వ తేదీ వరకు నేరుగా ప్రవేశాలు కల్పిస్తామని తెలిపారు. వివరాలకు 99494 35594, 89852 97854 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

దాడి ఘటనలో టీడీపీ కార్యకర్తలపై కేసు

అమరావతి: అమరావతిలో ఈ నెల 9వ తేదీన బస్సుపై దాడి చేసిన టీడీపీ కార్యకర్తలపై పోలీసులు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కోటేశ్వరరావు మంగళవారం పేర్కొన్నారు. అధికార పక్షం, ప్రతిపక్షం అభివృద్ధిపై చర్చకు సవాళ్లు విసురుకున్న నేపథ్యంలో ఈనెల 9వ తేదీన అమరావతిలో శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా పోలీసులు మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్‌ను అదుపులోకి తీసుకున్నారు. శ్రీధర్‌ను అమరావతి పోలీస్‌స్టేషన్‌కు తరలిస్తున్న బస్సుపై టీడీపీ కార్యకర్తలు దాడి చేశారు. ఘటనలో బస్సు అద్దం పగిలిపోవటంతో 17మంది టీడీపీ కార్యకర్తలపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. 9వ తేదీ ఉదయం 144 సెక్షన్ అమలులో ఉండగా నిబంధనలు అతిక్రమించిన కొంతమందిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

వేంకటాచల మహత్మ్యం గ్రంథావిష్కరణ

నగరంపాలెం(గుంటూరు): స్థానిక బృందావన్‌గార్డెన్స్‌లోని కంచి కామకోటి పీఠ పాలిత వేంకటేశ్వర స్వామి దేవాలయ ఆవరణలోని అన్నమయ్య కళా వేదికపై మంగళవారం కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి మహాస్వామి మంగళా శాసన పూర్వకంగా వేంకటాచల మాహాత్మ్యం గ్రంథావిష్కరణ చేశారు. స్వామి అనుగ్రహభాషణం చేస్తూ సనాతన ధర్మ పరిరక్షణే మానవ జాతికి రక్ష అని ఆయన పేర్కొన్నారు. సభా కార్యక్రమానికి గౌరవ అతిథులుగా ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యు.దుర్గాప్రసాద్, ఏపీ శాసనసభ సెక్రటరీ జనరల్ పి.పి.కె.రామాచార్యులు, ఆత్మీయ అతిథులుగా వీజీఎస్ పబ్లిషర్స్ చైర్మన్ శిరం రామారావు, ఆలయ పాలకమండలి అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య, భారతి ధార్మిక విజ్ఞాన పరిషత్ వ్యవస్థాపకుడు బొల్లేపల్లి సత్యనారాయణ హాజరవ్వగా, గ్రంథ సమీక్షకులు ఆచార్య ధూళిపాళ రామకృష్ణ, గుదిమెళ్ల కూర్మనాథన్, గ్రంథకర్త డాక్టర్ దీవి నరసింహదీక్షిత్ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే సదరం క్యాంపులు

నరసరావుపేట: పల్నాడు జిల్లాలోని సదరం క్యాంపులు ఏపీ వైద్యవిధాన పరిషత్‌కు చెందిన ప్రభుత్వ ఆస్పత్రుల్లో వారాల వారీగా నిర్వహిస్తారని జిల్లా ప్రభుత్వ వైద్యశాలల పర్యవేక్షణాధికారి డాక్టర్ బీవీ రంగారావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నరసరావుపేటలో మంగళ, శుక్రవారాల్లోను, సత్తెనపల్లిలో శుక్రవారం, చిలకలూరిపేటలో బుధవారం, పెదకూరపాడులో మంగళవారం, వినుకొండలో మంగళవారం, గురజాల, మాచర్లలో శుక్రవారాల్లో నిర్వహిస్తారని పేర్కొన్నారు. పైన తెలిపిన వారాల్లో సదరం స్లాట్స్ బుకింగ్ చేసుకొన్న వారికి చూస్తారని తెలిపారు. గతంలో వెయిటింగ్ లిస్టు వచ్చిన వారికీ వారి రిజిస్టర్డ్ మొబైల్ ఫోన్‌కి మెసేజ్ వస్తుందన్నారు. వారికి ఏ తేదీన వస్తే ఆ రోజు ఆ హాస్పిటల్ వెళ్లి సంప్రదించాలని కోరారు.